ఫిక్స్‌డ్ వడ్డీరేటు తప్పనిసరి: ఆర్బీఐ

ముంబై, జనవరి 10: ఈఎంఐ (నెలవారీ వాయిదా సమాన చెల్లింపులు) ఆధారిత వ్యక్తిగత రుణాల్లో ఫిక్స్‌డ్ వడ్డీరేటు ప్రోడక్ట్‌ను కూడా కస్టమర్లకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని శుక్రవారం బ్యాంకులకు, తమ పరిధిలోని ఇతర ఆర్థిక సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆదేశించింది. రుణాల మంజూరు సమయంలో వర్తించే వార్షిక వడ్డీరేటు, వార్షిక పర్సంటేజ్ రేట్ల సమాచారం రుణగ్రహీతలకు తెలియపర్చాలని, రుణ ఒప్పందంలో పేర్కొనాలని కూడా స్పష్టం చేసింది. అప్పు తీసుకున్న తర్వాత ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటు కారణంగా ఈఎంఐ లేదా టెన్యూర్‌లో ఏదైనా పెరుగుదల ఉన్నా ఆ సమాచారాన్ని రుణగ్రహీతకు చెప్పాలన్నది. అసలు, వడ్డీ బకాయిలు, మిగిలిన ఈఎంఐల వివరాలనూ మూడు నెలలకోసారి అందజేయాలని ఆర్బీఐ రుణదాతలకు సూచించింది.

రూపీ@86.04

చారిత్రక రికార్డు కనిష్ఠానికి పతనం • ఒక్కరోజే 18 పైసలు క్షీణత

ముంబై, జనవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మరో ఆల్‌టైమ్ కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ఒక్కరోజే 18 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 86 మార్కుకు ఎగువన 86.04 స్థాయికి క్షీణించింది. తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు.. రూపీని కూలదోశాయని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రానుండటంతో అగ్రరాజ్య వ్యాపారానుకూల నిర్ణయాలు పెద్ద ఎత్తున ఉంటాయన్న అంచనాల మధ్య డాలర్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిందని కూడా విశ్లేషిస్తున్నారు. కాగా, గత కొద్ది రోజులుగా క్రమేణా పడిపోతున్న రూపాయి పతనం.. భారతీయ దిగుమతులను మరింత భారం చేస్తుండగా, దేశ ఆర్థిక వ్యవస్థకూ కొత్త చిక్కుల్ని తెచ్చిపెడుతున్నది.



ఫారెక్స్ రిజర్వులు డౌన్

ఈ నెల 3తో ముగిసిన వారంలో దేశంలోని ఫారెక్స్ రిజర్వులు మరింతగా క్షీణించాయి. 5.693 బిలియన్ డాలర్లు దిగజారి 634.585 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా ప్రకటించింది. అంతకుముందు వారం కూడా 4.112 బిలియన్ డాలర్లు పడిపోయిన విషయం తెలిసిందే. కాగా, గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆల్‌టైమ్ హైని తాకుతూ ఫారెక్స్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. కానీ మూడున్నర నెలల్లో 70 బిలియన్ డాలర్లు హరించుకుపోవడం గమనార్హం.

ఒకే ఐటీఆర్.. ఓ గేమ్ ఛేంజర్



దంపతులకు సంయుక్త ఐటీ రిటర్న్
కొత్త పన్ను విధానంలో కల్పించాలి
కేంద్రానికి ఐసీఏఐ బడ్జెట్ సూచన
మరికొన్ని కీలక ప్రతిపాదనలూ సిఫారసు

న్యూఢిల్లీ, జనవరి 10: మరో మూడు వారాల్లో కేంద్ర బడ్జెట్ రానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పద్దును ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తమ ప్రీ-బడ్జెట్ మెమరాండంలో కేంద్ర ప్రభుత్వానికి ఓ సూచన చేసింది. నూతన పన్ను విధానంలో భార్యాభర్తలకు ఒకే ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ను కలిసి దాఖలు చేసే అవకాశం కల్పించాలన్నదే ఆ సూచన. ఈ జాయింట్ ట్యాక్సేషన్ స్కీం కుటుంబాలకు లాభిస్తుందని, అంతేగాక పన్ను ఎగవేతలకూ చెక్ పెట్టినట్టవుతుందని పేర్కొన్నది. 'కొత్త పన్ను విధానంలో పెండ్లైన ట్యాక్స్ పేయర్ జంటలకు తమ భాగస్వామితో కలిసి సంయుక్త ఐటీఆర్ దాఖలును ఎంచుకొనే వీలు కల్పించాలి. అలాగే వేర్వేరుగా ఐటీఆర్‌లను దాఖలు చేసే అవకాశం కూడా ఇవ్వాలి' అని ఐసీఏఐ సూచించింది. ఏది ఎంచుకుంటారో ట్యాక్స్ పేయర్స్‌కే వదిలేయాలన్నది.

ఇప్పటిదాకా..

ఐటీఆర్ దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ప్రస్తుతం పాత, కొత్త పన్ను విధానాలను ఎంచుకొనే వెసులుబాటు ఉన్నది. కొత్త పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.3 లక్షల దాకా ఉంటే ఎటువంటి పన్నులూ చెల్లించనక్కర్లేదన్న విషయం తెలిసిందే. అయితే ఈ జాయింట్ ఐటీఆర్ ట్యాక్స్ పేయర్స్‌కు దాన్ని రెట్టింపు చేయాలని, పన్ను మినహాయింపును రూ.6 లక్షలకు పెంచాలని ఐసీఏఐ సూచించింది. ఇక పాత పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలదాకా పన్ను మినహాయింపున్నది. ఈ క్రమంలోనే జాయింట్ ఐటీఆర్ ప్రతిపాదనను ఐసీఏఐ తీసుకురాగా, జీవన వ్యయాలు పెరిగినందున పన్ను మినహాయింపును కూడా పెంచాల్సిన అవసరం ఉందని గుర్తుచేస్తున్నది. దీంతో ఇప్పుడిది సోషల్ మీడియాలో ట్రెండింగ్ ఉన్నది.

ఇదీ సంగతి..

నిజానికి దంపతులకు జాయింట్ ట్యాక్సేషన్ అనేది కొత్తదేమీ కాదు. ఆయా అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్నదే. అమెరికా, బ్రిటన్‌లలో భార్యాభర్తలు సంయుక్తంగా ఆదాయ పన్ను రిటర్నును దాఖలు చేసే వీలున్నది. దీనివల్ల విడివిడిగా ఐటీఆర్‌లను దాఖలు చేస్తున్నవారితో పోల్చితే పన్ను మినహాయింపు, పన్ను శ్లాబులు పెరుగుతుండటంతో చాలామంది జాయింట్ ఐటీఆర్‌లనే ఎంచుకొని పన్ను భారాన్ని తగ్గించుకుంటున్నారు. ఈ క్రమంలో భారత్‌లోనూ దంపతులకు జాయింట్ ఐటీఆర్ దాఖలుకు అవకాశమిస్తే కుటుంబాలపై పన్ను భారం తగ్గి, ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని, గృహస్తులకు మేలు జరిగితే దేశ ఆర్థిక వ్యవస్థకూ జరుగుతుందని ఐసీఏఐ అభిప్రాయపడుతున్నది.

పన్ను రేట్లు తగ్గాలి: అసోచామ్

రాబోయే బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను తగ్గించడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తప్పక దృష్టి సారించాలని అసోచామ్ తమ ముందస్తు బడ్జెట్ నివేదికలో అభిప్రాయపడింది. కార్పొరేట్ పన్ను రేట్లు ఇతర దేశాలతో పోల్చితే పోటీగానే ఉన్నాయన్న ఈ వ్యాపార, పారిశ్రామిక సంఘం.. వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లు మాత్రం తగ్గాల్సిన అవసరం ఉందని గట్టిగా పేర్కొనడం గమనార్హం. గరిష్ఠంగా హాంకాంగ్‌లో 15 శాతం, శ్రీలంకలో 18 శాతం, సింగపూర్‌లో 22 శాతం, బంగ్లాదేశ్‌లో 25 శాతంగా ఉన్నాయని గుర్తుచేసింది.

ప్రతిపాదిత ట్యాక్స్ శ్లాబులు

జాయింట్ ఐటీఆర్‌లను దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు వర్తించే ట్యాక్స్ శ్లాబులనూ ఐసీఏఐ సూచించింది.

- రూ.6 లక్షలదాకా పన్ను ఉండదు
- రూ.6-14 లక్షల వరకు 5%
- రూ.14-20 లక్షల వరకు 10%
- రూ.20-24 లక్షల వరకు 15%
- రూ.24-30 లక్షల వరకు 20%
- రూ.30 లక్షలపైన 30%

ఐసీఏఐ సూచనలివే..

- జాయింట్ ఐటీఆర్ ట్యాక్స్ పేయర్స్‌కు వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపుంటే పన్ను మినహాయింపు.
- సర్‌చార్జ్ వర్తింపు పరిమితి రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పెంపు.
- వార్షిక ఆదాయం కోటి-రూ.2 కోట్ల మధ్య ఉంటే సర్‌చార్జ్ 10%.
- రూ.2-4 కోట్ల మధ్య ఉంటే 15%.
- రూ.4 కోట్లు దాటితే సర్‌చార్జ్ 25%.
- ఉద్యోగులైతే భార్యాభర్తలిరువురికీ స్టాండర్డ్ డిడక్షన్‌ను వర్తింపజేయాలి.

13 వరకు జీఎస్టీ ఫైలింగ్ గడువు

న్యూఢిల్లీ, జనవరి 10: జీఎస్టీ సేల్స్ రిటర్నులకు సంబంధించి జీఎస్టీఆర్-1, జీఎస్టీ చెల్లింపులకు సంబంధించిన గడువును మరో రెండు రోజులు పొడిగించింది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ పరోక్ష పన్నులు, కస్టమ్స్(సీబీఐసీ). ఫైలింగ్ రిటర్నులకు సంబంధించి గడిచిన రెండు రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పన్ను చెల్లింపుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గడువు పెంచాలని వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సీబీఐసీ ఈ గడువును 13 వరకు పెంచింది. అలాగే క్యూఆర్‌ఎంపీ స్కీం కింద అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికపు చెల్లింపుల గడువను ఈ నెల 15కి పెంచింది. దీంతో పాటు జీఎస్టీఆర్3బీ కి సంబంధించి జీఎస్టీ చెల్లింపుల గడువును కూడా ఈ నెల 22 వరకు పెంచింది.

టీవీఎస్ లక్ష్మణన్ మృతి

చెన్నై, జనవరి 10: టీవీఎస్ ఫ్యామ్లీ వెటరన్, సుందరం-క్లేటన్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్ లక్ష్మణన్ మరణించారు. ఆయన వయస్సు 92 ఏండ్లు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా టీవీఎస్ మోటర్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్ మాట్లాడుతూ..హెచ్ లక్ష్మణన్ మరణం చాలా బాధకరమైన విషయమన్నారు.

క్రిప్టోతో 95 కోట్ల మోసం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): నకిలీ వెబ్ సైట్ ద్వారా నగదు చెల్లిస్తే రెట్టింపు రాబడి వస్తున్నదని రూ.95 కోట్లు కొట్టేసిన వ్యక్తిని సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈమేరకు కరీంనగర్‌కు చెందిన మనోజ్ కుమార్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుని పట్టుకొని రిమాండ్‌కు తరలించామని సీఐడీ డీజీ షిఖా గోయెల్ ప్రకటించారు. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రెముల రమేశ్ గౌడ్ నకిలీ వెబ్ సైట్‌ను సృష్టించారు. జీబీఆర్ అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా ఈ వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే క్రిప్టో కరెన్సీ రూపంలో రెట్టింపు లాభం పొందవచ్చని 43 మంది నుంచి రూ.95 కోట్లు వసూలు చేసి, వీటిని తిరిగి చెల్లించకపోవడంతో మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

స్టార్టప్‌లకు కేరాఫ్‌గా తెలంగాణ

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తేతెలంగాణ): తెలంగాణ రాష్ట్రం స్టార్టప్‌లకు కేరాఫ్‌గా మారుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన ఆరిక్ట్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరిక్ట్ ఇన్నోవేషన్ హబ్‌తో కొత్తగా 300 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో ఐటీ సాధించిన విప్లవాత్మక అభివృద్ధి కారణంగా రాష్ట్ర జీడీపీ, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో ఐటీ వార్షిక ఎగుమతులు 30 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే 6 వేల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. హైదరాబాద్ అంటే టాలెంట్, టెక్, ఇన్నోవేషన్, స్టార్టప్స్ సిటీ అని అభివర్ణించారు.

రియల్టీలోకి 11 బి.డాలర్లు

బెంగళూరు, జనవరి 10: దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలోకి విదేశీ పెట్టుబడుల హవా కొనసాగుతున్నది. విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. 2024లో 11.4 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ సేవల సంస్థ సీబీఆర్‌ఈ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ల వాటా 44 శాతంగా ఉండగా, ఇన్‌స్టిట్యూషనల్ పెట్టుబడిదారుల వాటా 36 శాతం, కార్పొరేషన్లు 11%, రిట్స్ 4%గా ఉన్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 54 శాతం ఎగబాకాయని పేర్కొంది. సింగపూర్, అమెరికా, కెనడాల నుంచి 25 శాతం పెట్టుబడులు వచ్చాయి.

12 లక్షల కోట్లు మటాష్

న్యూఢిల్లీ, జనవరి 10: స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వరుసగా మూడు రోజులుగా భారీ నష్టాల్లో ట్రేడవుతుండటంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోతుండటం, త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు నిస్తేజంగా ఉండటంతో గత మూడు రోజుల్లో రూ.12 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 820.2 పాయింట్లు లేదా 1.04 శాతం నష్టపోయింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.12,07,314.99 కోట్లు కరిగిపోయి రూ.4,29,67,835.05 కోట్లు(5 ట్రిలియన్ డాలర్లు)కు తగ్గింది. క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం, డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం కూడా మార్కెట్ల పతనానికి కారణం. మరోవైపు, వారాంతం ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 241.30 పాయింట్లు నష్టపోయి 77,378.91 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 95 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద నిలిచింది. మార్కెట్లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్‌లు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు, టీసీఎస్ షేరు 6 శాతం పెరిగి టాప్‌గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే పవర్ అత్యధికంగా 3.07 శాతం నష్టపోగా, యుటిలిటీ 2.86 శాతం, రియల్టీ 2.64 శాతం, ఇండస్ట్రియల్స్ 2.08 శాతం, కమోడిటీస్ 2.05 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.98 శాతం నష్టపోయాయి. కానీ, ఐటీ 3.17 శాతం, టెక్నాలజీ 2.24 శాతం చొప్పున లాభపడ్డాయి.

రైతుల హక్కులను కాలరాయొద్దు

- శాంతియుత ఆందోళనలో పోలీసుల ప్రమేయం ఎందుకు?
- ఫార్మా రైతులకు హైకోర్టులో ఊరట

రంగారెడ్డి, జనవరి 10 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలోని ఫార్మా అనుబంధ గ్రామాల్లో రైతులకు హైకోర్టులో ఊరట లభించింది. ఫార్మా అనుబంధ గ్రామాల్లో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహించకూడదని పోలీసులు ఆంక్షలు విధించిన నేపథ్యంలో యాచారం మండలంలోని పలు గ్రామాల రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రైతులు, ప్రభుత్వ వాదనలు విన్న తర్వాత హైకోర్టు రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేసింది. ఫార్మా అనుబంధ గ్రామాల్లో రైతులు శాంతియుతంగా ఆందోళనలు చేసుకోవచ్చని, పోలీసులు ఆటంకం కల్పించవద్దంటూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా, యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి తదితర గ్రామాల్లో ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకోసం ప్రభుత్వ భూములను, కొన్ని పట్టా భూములను సైతం సేకరించింది. మరో 22 వేల ఎకరాల్లో పట్టా భూములు ఇవ్వటానికి రైతులు ఒప్పుకోలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిందేనంటూ రైతులపై ఒత్తిడి తీసుకువచ్చింది. పట్టా భూములకు సంబంధించి ప్రకటించిన పరిహారాన్ని ప్రభుత్వం కోర్టులో జమచేసింది. ఆ తర్వాత రైతుల భూములను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి టీఎస్ఐఐసీ పేర్ల మీదకు బదలాయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. బాధిత రైతులంతా ఫార్మా వ్యతిరేక పోరాట సమితిని ఏర్పాటు చేసుకుని గ్రామా ల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. అప్రమత్తమైన పోలీసులు ఎక్కడికక్కడ ర్యాలీలను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే నిరాకరిస్తున్నారు. దీంతో బాధిత రైతులు ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యం లో హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తి శుక్రవారం రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేశారు. రాజ్యాంగపరంగా రైతులకు ఉన్న హక్కును కాలరాయొద్దని, శాంతియుతంగా వారు ఆందోళన చేసుకోవటంలో తప్పేంటని న్యాయమూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు.

శాంతియుత ఆందోళనలు

హైకోర్టు సూచనల మేరకు శాంతియుతంగా పోరాడుతామని ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు కావుల సరస్వతి తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు తమను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

బార్ కౌన్సిల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పండి

హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని హైకోర్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతోపాటు రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు స్పష్టం చేసింది. ప్రస్తుత బార్ కౌన్సిల్ పాలకవర్గం గడువు 6 నెలల క్రితమే ముగిసినందున ఎన్నికల షెడ్యూలు వివరాలను సమర్పించాలని ఆదేశించింది. తెలంగాణ బార్ కౌన్సిల్ పాలకవర్గ గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించడం లేదని న్యాయవాది కే అశోక్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం ఈ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

కోదాడలో సైబర్ దందా!

- నేరగాళ్ల ఉచ్చులో రెండు గ్రామాల యువత
- వారితోనే జోరుగా మోసాలు
- తీగలాగితే కదిలిన డొంక

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): యువతకు కమీషన్ల ఆశ చూపి సైబర్ మోసాల ఉచ్చులోకి లాగుతున్నారు నేరగాళ్లు. కోదాడ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో చాలా మంది యువతి, యువకులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. సైబర్ నేరాల కేసుల్లో 23 మందిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీసీఎస్ భవన్‌లో సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత మాట్లాడుతూ 'కోదాడ పరిసరాల్లోని రెండు గ్రామాల్లో నివసిస్తున్న వందలాది మంది యువతి, యువకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నట్టు వెల్లడైంది. తొలుత ట్రేడింగ్‌లో లాభాలంటూ సైబర్ మోసగాళ్లు విసిరిన ఉచ్చులో కొంతమంది యువత చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నారు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో బ్యాంకు ఖాతాలు ఇస్తే కమీషన్లు ఇస్తామని సైబర్ నేరగాళ్లు నమ్మబలికారు. బ్యాంకు ఖాతాల్లోకి వచ్చిన డబ్బులను డాలర్లుగా పంపిస్తే 5 శాతం కమీషన్ అంటూ ఆశ చూపారు. దీంతో డబ్బులు పోగొట్టుకున్న యువతతోపాటు చాలా మంది బ్యాంకు అకౌంట్ నంబర్లు ఇవ్వడం మొదలు పెట్టారు. అయితే ట్రేడింగ్ కేసు దర్యాప్తులో రెండు ఖాతాలు కోదాడ పరిసర గ్రామాల్లోని విగా గుర్తించాం. అక్కడికి వెళ్లి ఆరా తీయడంతో ఒకటి కాదు.. రెండు కాదు.. వందల మంది యువత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నట్టు తేలింది' అని వెల్లడించారు.

ఎమ్మెల్యేగా పోటీ చేసి.. సైబర్ నేరాలకు..

అరెస్టు అయిన వారిలో ఉత్తరప్రదేశ్‌లో స్వచ్ఛంద సంస్థను నడుపుతూ ఎమ్మెల్యేగా పోటీ చేసిన కమలేశ్‌కుమారి కూడా ఉన్నదని డీసీపీ తెలిపారు. ఈమె స్వచ్ఛంద ఖాతాను వాడుకున్న సైబర్ నేరగాళ్లు భారీగా కమీషన్ ఇచ్చారని చెప్పారు. అరెస్టైయిన వారిలో విదేశాలలో ఉన్న కీలక సూత్రధారులకు భారత్ నుంచి సహకరిస్తున్నవాళ్లూ ఉన్నారని పేర్కొన్నారు.

కోర్టుకు హాజరైన 'ఫోన్ల ట్యాపింగ్' నిందితులు

తదుపరి విచారణ 24కు వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా కొనసాగుతున్న మాజీ పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును చంచల్‌గూడ జైలు అధికారులు శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్న మరో నిందితుడు భుజంగరావు తరపున ఆయన న్యాయవాది గైర్హాజరు పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను అంగీకరించిన కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 27న సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగనున్నాయి.

ఒకేరోజు 50వేల గజాలు రిజిస్ట్రేషన్

- ఖమ్మం జిల్లా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అర్ధరాత్రి అక్రమంగా మూకుమ్మడి రిజిస్ట్రేషన్లు
- ఇరువైపులా అధికార పార్టీ అండదండలు
- 10 ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్
- జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రికి తెలియకుండానే.. మరో మంత్రి అనుచరులుగా చెప్పుకుంటున్న వారికి అక్రమ రిజిస్ట్రేషన్లు

ఖమ్మం, జనవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం జిల్లా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఒకేరోజు 50 వేల గజాలను రిజిస్ట్రేషన్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీపీఏ చేసుకున్న వ్యక్తి అనుమతి లేకుండానే ప్లాట్ల యజమానులు రిజిస్ట్రేషన్లు చేసుకోవడం.. ఎల్ఆర్ఎస్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంతోపాటు దాదాపు 10 పాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో జరిగిన ఈ వ్యవహారంపై జిల్లాకు చెందిన ఓ మంత్రి సీరియస్ అయ్యారు. దీనిపై రిజిస్ట్రేషన్ల శాఖ సైతం విచారణకు ఆదేశించింది. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అమ్మపాలెం, తనికెళ్ల తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వెంచర్లు ఉండగా.. వీటిలో మండల పరిధిలోని 'ఇండో ఖతర్' పేరుతో కొన్నేండ్ల క్రితం పెద్ద ఎత్తున వెంచర్లు వెలిశాయి. పదేండ్ల క్రితం జీపీఏ తీసుకున్న ఓ వ్యక్తి ప్రస్తుత అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి అనుచరుడిగా పేరొందాడు. అతడు 'ఇండో ఖతర్' వెంచర్‌లోని కొంత భాగాన్ని డెవలప్‌మెంట్ పేరుతో భూ యజమానుల నుంచి జీపీఏ పొందాడు. అయితే డెవలపర్‌కు, భూ యజమానులకు మధ్య వివాదం తలెత్తడంతో డెవలపర్‌కు ఇచ్చిన జీపీఏను రద్దు చేయకుండానే ఆ భూమికి సంబంధించిన వారు మరో కీలక మంత్రి అనుచరులుగా చెప్పుకుంటూ రిజిస్ట్రేషన్ అధికారులతో తమ పనిని గుట్టుగా చేయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ అండదండలతో జీపీఏ రద్దు చేయకుండానే సదరు భూమికి చెందిన వ్యక్తులు నిబంధనలు తుంగలో తొక్కి.. రిజిస్ట్రేషన్ అధికారులను మభ్యపెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలుస్తున్నది. ఒకే వెంచర్‌కు సంబంధించి 64 రిజిస్ట్రేషన్లు చేయడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ 64 రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు 50 వేల గజాలను సదరు జీపీఏ రద్దు కాకుండానే రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. జీపీఏ ఉన్న వ్యక్తి 10 ప్లాట్లను ఇదివరకే ఇతరులకు విక్రయించగా.. సదరు ఆ ప్లాట్లకు సైతం అధికారులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిసింది. పూర్తిగా ప్రలోభాలకు లొంగే ఈ ప్రక్రియ జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. 50 వేల చదరపు గజాలు రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని రిజిస్ట్రేషన్ అధికారులు పెద్దగా చెప్పుకున్నారే తప్ప నిబంధనలను తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్లు జరిగిన తీరును పట్టించుకోలేదు. రిజిస్ట్రేషన్ అయిన భూములకు ఎల్ఆర్ఎస్ లేకపోయినా.. లేఅవుట్ ఉందన్న కారణంతో అన్నింటికీ కలిపి రిజిస్ట్రేషన్ చేయడం అధికార పార్టీ ఒత్తిళ్లే కారణమన్న భావన వ్యక్తమవుతున్నది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన ఈ వ్యవహారం వెలుగులోకి ర